

## జిల్లాలో 30, 30(ఎ) పోలీసు యాక్ట్ అమలు

**మెదక్, అక్టోబర్ 30 (ప్రజా స్వరం) :**

మెదక్ జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకుని నవంబర్ 1వ తేదీ నుండి 30వ తేదీ వరకు పాటు జిల్లా వ్యాప్తంగా 30, 30(ఎ) పోలీస్ యాక్ట్ 1861 అమలులో ఉంటుందని మెదక్ జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. దీని ప్రకారం పోలీసు అధికారుల అనుమతి లేకుండా జిల్లాలో ప్రజలు ధర్నాలు, రాస్తా రోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. ప్రజా ధనాన్ని నష్టం కల్గించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని ఎస్పీ హెచ్చరించారు. ఈ విషయాన్ని గమనించి జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు తమకు సహకరించాలని తెలిపారు.

# కొత్త చట్టాలతో సత్వర న్యాయం

### నూతన చట్టాలపై ప్రతిఒక్కరికి అవగాహన అవసరం

### మెదక్ జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

**మెదక్, అక్టోబర్ 30 (ప్రజా స్వరం) :**

బాధితులకు మరింత న్యాయం చేకూరేలా కొత్తచట్టాలను రూపొందించామని జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం మెదక్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా పోలీస్ అధికారులకు నూతన చట్టాలు వాటి అమలుపై జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్యా అధినియం2023పై జిల్లాలలోని పోలీస్ అధికారులు, సిబ్బందికి ఇది వరకే శిక్షణ ఇచ్చామని జులై ఒకటో తేదీ నుంచి దేశవ్యాప్తంగా భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్యా అధినియం2023 చట్టాలు అమలులోకి వచ్చాయని అన్నారు. ప్రతీ పోలీస్ అధికారి, సిబ్బందికి కొత్త చట్టాలపై అవగాహన ఉండాలనే ఉద్దేశంతో శిక్షణా తరగతులు నిర్వహించామని తెలిపారు. కొత్త చట్టాలు అమలు జరిగిన వెంటనే ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అన్ని సెక్షన్లపై పూర్తి అవగాహన అవసరమన్నారు. నూతన చట్టాల ద్వారా కేసుల దర్యాప్తు, విధి విధానాలు, విచారణ పద్ధతుల్లో, శిక్షలలో మార్పు వస్తుందని, ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించేందుకు ఈ కొత్త చట్టాలు వీలుగా ఉంటాయన్నారు. అధికారులు, సిబ్బంది కొత్త చట్టాలను నేర్చుకొని అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ అడ్మిన్ మహేందర్, తూప్రాన్ డీఎస్పీ వెంకటరెడ్డి, మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్, ఎస్బీ సీఐ సందీప్‌రెడ్డి, డీసీఆర్బీ సీఐ మధుసూదన్ గౌడ్, జిల్లా సీఐలు, ఎస్ఐలు, ఐటీ కోర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





## జిల్లా ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు

### జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**మెదక్, అక్టోబర్ 30 (ప్రజా స్వరం) :**

దీపావళి పండుగ సందర్భంగా జిల్లా ప్రజలకు కలెక్టర్ రాహుల్‌రాజ్ శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం కలెక్టర్ రాహుల్‌రాజ్ విలేకరులతో మాట్లాడుతూ దీపావళి పండుగను సురక్షితంగా జరుపుకోవాలని సూచించారు. బాణాసంచాలు కాల్చే సమయంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలన్నారు. ముఖ్యంగా చిన్నారులు పెద్దల సమక్షంలో బాణాసంచాలు కాల్చేలా చూడాలని సూచించారు. బాణసంచా విక్రయదారులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలన్నారు. ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు రెవెన్యూ, అగ్నిమాపక, పోలీస్, పురపాలక, పంచాయతీ అధికారులు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. బాణసంచా దుకాణాల వద్ద రక్షణ చర్యలు పాటించాలని, ఎక్కడ పడితే అక్కడ బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వాహనాల పార్కింగ్‌లో తగిన జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉందని, వాహన దారులు బాణసంచా దుకాణాలకు దూరంగా పార్కింగ్ చేయాలని సూచించారు. ఏదేని ప్రమాదం వాటిల్లితే తక్షణ చర్యలు చేపట్టేందుకు అగ్నిమాపక వాహనాలు, ఇసుక, నీళ్ల డ్రములు అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. ఈ దీపావళి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలను, కొత్త వెలుగులను నింపాలని ఆకాంక్షిస్తూ, జిల్లా ప్రజలందరికీ దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

## సమగ్ర కుటుంబ సర్వేశిక్షణ

### ఆర్డీవో రమాదేవి



**రామాయంపేట, అక్టోబర్ 30( ప్రజా సర్వం) :**

మెదక్ జిల్లా రామాయంపేట మండల కేంద్రంలో బుధవారం సమగ్ర కుటుంబ సర్వే సమీక్ష నిర్వహించారు. ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ ఉద్యోగులకు నిర్వహించిన సమీక్షకు మెదక్ ఆర్డీవో రమాదేవి ముఖ్యతిథిగా హాజరయ్యారు. నవంబర్ 1 నుంచి ప్రారంభం కానున్న సమగ్ర కుటుంబ సర్వేలో అధికారులు పాల్గొనాలని, 54 ప్రశ్నలపై అవగాహన కలిగి ఉండాలని క్షేత్రస్థాయిలో పర్యటించి కుటుంబ సర్వే చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ రజనీకుమారి, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పత్తి మార్కెట్‌ను పరిశీలించిన పాలకమండలి

**గజ్వేల్, అక్టోబర్ 30(ప్రజాస్వరం) :**

గజ్వేల్ పట్టణ శివారులోని పత్తి మార్కెట్‌ను బుధవారం గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, మార్కెట్ సెక్రటరీ జాన్ వెస్లీ, డైరెక్టర్లు కర్ణాకర్‌రెడ్డి, నర్సింహరెడ్డి, డాక్టర్ వహీద్, మహంకాళి శ్రీనివాస్ గుప్తా, యాదయ్య, శ్రీనివాస్‌గౌడ్, రామాగౌడ్, సూపర్‌వైజర్ మహిపాల్‌లతో కూడిన బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా ఎంతో విలువైన మార్కెట్ స్థలం అన్యాక్రాంతం కాకుండా ప్రహరిగోడ నిర్మాణం లేదా ఫెన్సింగ్ ఏర్పాటు చేసి భూమిని కాపాడాలని నిర్ణయించారు. అయితే త్వరలోనే ఈ పనులు పూర్తి చేసి వినియోగంలోకి తెస్తే సమస్యలు ఉండవని వారు తెలిపారు. అలాగే రైతులు పండించిన పత్తిని త్వరలోనే కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కొనుగోలు ప్రారంభిస్తామని, వరి ధాన్యం కొనుగోలుకు అవసరమైన ప్రతిచోట ఐకేపీ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో దళారులు, ఏజెంట్లను నమ్మి మోసపోవద్దన్నారు. అన్నదాతల సంక్షేమానికి మార్కెట్ పాలక మండలి కట్టుబడి పనిచేస్తుందని, ఎక్కడ అన్యాయం జరిగిన రైతులు తమ దృష్టికి తేవాలని స్పష్టం చేశారు.



గత ప్రభుత్వాలకు భిన్నంగా రైతులు పండించిన ప్రతి పంటను వివిధ కార్పొరేషన్ల ద్వారా సీఎం రేవంత్ రెడ్డి సారధ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు.

## ది మాస్టర్ మైండ్ పాఠశాలలో దీపావళి సంబురాలు




**జగదేవ్ పూర్, అక్టోబర్ 30 ( ప్రజా స్వరం) :**

జగదేవపూర్ మండలం కేంద్రంలో ది మాస్టర్ మైండ్ పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు దీపావళి వేడుకలు ఉత్సాహంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల యజమాన్యం రాఘవేంద్రారెడ్డి మాట్లాడుతూ ముందుగా మండల ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నిండాలని ఆకాంక్షించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి సంకేతంగా దీపావళి జరుపుకుంటామన్నారు. అలాగే బాణాసంచా కాల్చేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ప్రవీణ్‌కుమార్, పాఠశాల ఇన్‌చార్జి నర్సింహులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## స్కాలర్‌షిప్‌లు విద్యార్థుల హక్కు

### ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బండారి ప్రశాంత్

**చేగుంట, అక్టోబర్ 30(ప్రజా స్వరం) :**



మెదక్ జిల్లా చేగుంట మండల కేంద్రంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రంలో పాలకులు మారిన ప్రజల బ్రతుకులు మారడం లేదని గత పాలకులు విద్యారంగాన్ని పూర్తిగా విధ్వంసం చేశారని, ప్రస్తుత ప్రభుత్వం సైతం విద్యారంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తూ మరింత విధ్వంసం చేస్తుందని, స్వయంగా ముఖ్యమంత్రి పర్యవేక్షిస్తున్న విద్యారంగానికి బడ్జెట్ కనీస నిధులు కేటాయించకుండా గతం కంటే తక్కువ (6.5శాతం) కేటాయించడం అంటే ఈ రాష్ట్ర ప్రభుత్వానికి విద్యారంగంపై ఎంత చిత్తశుద్ధి ఉందో అవగతం అవుతుందన్నారు, పేద, మధ్య తరగతి విద్యార్థుల ఉన్నత చదువు కోసం సంజీవని లాంటి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ఈ ప్రభుత్వం తూట్లుపొడిచే ప్రయత్నం చేయడం సిగ్గుచేటని, గత మూడు సంవత్సరాలుగా దాదాపు రూ.7500 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నా ఈ ప్రభుత్వం ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్న తీరును ఏబీవీపీ తీవ్రంగా పరిగణిస్తుందన్నారు. రాష్ట్రంలో స్కాలర్‌షిప్స్, రీయింబర్స్‌మెంట్‌పై ఆధారపడి దాదాపు 15 లక్షల మందికిపైగా విద్యను అభ్యసిస్తున్నారని, ఈ కాంగ్రెస్ ప్రభుత్వం స్కాలర్‌షిప్స్ ఇవ్వకుండా, ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయకుండా పేద విద్యార్థుల జీవితాలను అంధకారంలోకి నెట్టే కుట్ర చేస్తుందని, పేద విద్యార్థులపై ప్రభుత్వ కుట్రలు ఆపి వెంటనే పెండింగ్‌లో ఉన్న 7500 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలనీ ఏబీవీపీ ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ కార్యకర్తలు వంశీ, రామకృష్ణ, హరి, నవీన్, లక్ష్మీ, ప్రియా, వర్ష, మనోజ్, శరణ్య, నవ్య పాల్గొన్నారు.





## దళారులను నమ్మి మోసపోవద్దు

### - పీఏసీఎస్ చైర్మన్ హన్మంత్‌రెడ్డి

**మెదక్, అక్టోబర్ 30 (ప్రజా స్వరం) :**


రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని పీఏసీఎస్ చైర్మన్ హనుమత్‌రెడ్డి తెలిపారు. మెదక్ మార్కెట్ కమిటీ ఆవరణలో బుధవారం కౌన్సిలర్ దొంతి లక్ష్మిముత్యంగౌడ్‌తో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వద్దనే రైతులు వారు పండించిన ధాన్యాన్ని విక్రయించాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతుల కోసం అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. దళారులకు రైతులు ధాన్యం విక్రయిస్తే రైతులు నష్ట పోయే ప్రమాదం ఉందన్నారు. అందుకే ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లోని విక్రయించాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి రాజశేఖర్, పీఏసీఎస్ డైరెక్టర్ రాములు, రైతులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

### - తూప్రాన్ మున్సిపల్ కమిషనర్

**తూప్రాన్, అక్టోబర్ 30 (ప్రజాస్వరం) :**

తూప్రాన్ మున్సిపాలిటీను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తామని నూతన మున్సిపల్ కమిషనర్ గణేశ్‌రెడ్డి అన్నారు. బుధవారం తూప్రాన్ నుండి బదిలీ అయిన కమిషనర్ ఖాజా మొయినుద్దీన్ నుండి ఆయన బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా గణేశ్‌రెడ్డి మాట్లాడుతూ అధికారులు పాలకవర్గం సహాయ సహకారాలతో తూప్రాన్‌లోని అన్ని వార్డులు అభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకుంటానన్నారు. మున్సిపాలిటీలో ఉన్న అన్ని సమస్యలను పరిష్కరిస్తామన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించి ఆయనను చైర్‌పర్సన్ మామిండ్ల జ్యోతి కృష్ణ, వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్, మేనేజర్ రఘువరన్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



## మొక్కజొన్న పరిశీలించిన జిల్లా అధికారులు

**నార్సింగి, అక్టోబర్ 30 (ప్రజా స్వరం) :**

నార్సింగి మండల పరిధిలోని పెద్ద తాండాలోని మొక్కజొన్న పంట పొలాలను జిల్లా వ్యవసాయ అధికారి గోవిందు, వ్యవసాయ విస్తరణ అధికారిని విజృంభణతో కలిసి క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు ఉధృతి ఎక్కువగా కనిపించిందన్నారు. కత్తెర పురుగు నివారణ చర్యలపై రైతులకు సూచనలు చేస్తూ క్లోరంట్రానిలిప్రోల్ 20 ఎస్సీ 0.3 ఎమ్ఎల్ ఒక్క లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. 25 30 రోజుల పైరులో కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలను ఎకరానికి 3 కిలోలు ఆకుల సుడులలో వేయాలని తెలిపారు. రైతులు పంటలలో ఇబ్బందులు ఎదురైతే అధికారులను సంప్రదించాలన్నారు.



